పారదర్శకంగా 'వైఎస్సార్ సంపూర్ణ పోషణ'

- గర్భిణులకు, బాలింతలకు ఇంటి వద్దకే పౌష్టికాహారం
- అక్రమాలకు తావులేకుండా పటిష్ట ప్రణాళిక
- ఫేస్ రికగ్నైజేషన్ యాప్ ద్వారా సరుకుల పంపిణీ



గర్భిణులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

నందికొట్కూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రతి శాఖలోనూ పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. ఎక్కడా అవినీతికి తావులేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోంది. తాజాగా ఐసీడీఎస్‌లోనూ ఇదే విధానాన్ని అమలు చేస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు, బాలింతలకు ఈ నెల నుంచి వైఎస్సార్ సంపూర్ణ పోషణ టేక్ హోమ్ రేషన్ కార్యక్రమంలో భాగంగా ఇళ్ల వద్దకే అందిస్తున్న పోషకాహారం పక్కదారి పట్టకుండా పటిష్ట ప్రణాళికతో ముందుకు వెళ్తోంది. అక్రమాలకు తావులేకుండా ఫేస్ రికగ్నైజేషన్ యాప్ ద్వారా పంపిణీ చేపడుతోంది.

ఫేస్ రికగ్నైజేషన్ యాప్ ద్వారా పంపిణీ..

పౌష్టికాహారం పంపిణీలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా ప్రభుత్వం ప్రత్యేకంగా ఎస్‌సీఎం, ఎఫ్ఆర్ఎస్ (ఫేస్ రికగ్నైజేషన్) యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. యాప్ వినియోగంపై ఇప్పటికే అంగన్‌వాడీలకు పూర్తిస్థాయి శిక్షణ ఇచ్చారు. వారి మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసుకున్న యాప్ ద్వారా అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకులు లబ్ధిదారుల ఫొటోను నమోదు చేస్తారు. లబ్ధిదారులు నడవలేని, కేంద్రానికి వచ్చి సరుకులు తీసుకోలేని స్థితిలో ఉంటే వారు సూచించిన కుటుంబ సభ్యుల ఫొటోను యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. అప్పుడు మాత్రమే వారికి సరుకులు ఇస్తారు. లబ్ధిదారులకు ఎప్పుడు సరుకులు అందజేసిన ఇదే పద్ధతిని అనుసరించనున్నారు.

నందికొట్కూరు నియోజకవర్గంలో లబ్ధిదారుల వివరాలు	
నియోజకవర్గంలో అంగన్‌వాడీ కేంద్రాలు	281
మినీ అంగన్‌వాడీ కేంద్రాలు	06
గర్భిణులు	2,136
బాలింతలు	1747
0–6 ఏళ్లలోపు పిల్లలు	13,841

బాలింతలకు బలమైన ఆహారం



బాలింతలకు సకాలంలో బలమైన ఆహారం సీఎం వైఎస్ జగనన్న ప్రభుత్వం అందిస్తుంది. వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా పారదర్శకంగా అంగన్‌వాడీ వర్కర్ సరులను సరఫరా చేస్తుంది. ఫేస్ రికగ్నైజేషన్ ద్వారా అందించడంతో అక్రమాలకు తావులేకుండా చేశారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షించదగినది. పోషకాహారం పక్కాదారి పట్టకుండా పకడ్బందీగా ప్రభుత్వం ఫేస్ రికగ్నైజేషన్ యాప్ అమలు చేయడం శుభాపరిణామం.

– చెన్నమ్మ, మారుతీనగర్, నందికొట్కూరు

ముఖ ఆధారిత విధానంతో అక్రమాలకు చెక్



ముఖ ఆధారిత విధానంతో అక్రమాలకు చెక్ పడినట్లే. మాకు రావాల్సిన కోటా సక్రమంగా అందుతుంది. అంగన్‌వాడీ కేంద్రానికి రాలేని పరిస్థితిలో ఉన్న వారు కుటుంబ సభ్యులలో సూచించిన వారి ఫొటోను తీసుకొని ఇవ్వడం మంచిదే. పక్కాగా అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగనన్న రుణం తీర్చుకోలేనిది.

– షబినా, జీ. వీరాపురం గ్రామం, కొత్తపల్లి మండలం

పారదర్శకత కోసమే



పౌష్టిహారం పంపిణీలో పారదర్శకత కోసమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఈ ముఖ ఆధారిత ఫొటో విధానాన్ని అమలు చేస్తుంది. ప్రతి నెలా పక్కాగా లబ్ధిదారులకు సరుకులను అందించేలా అంగన్‌వాడీలకు ఆదేశాలిచ్చాం. కోడి గుడ్లు, పాలు రెండు విడతలుగా అందించనున్నాం.

– కోటేశ్వరమ్మ, నందికొట్కూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ

నేడు డయల్ యువర్ డీఎం

ఆత్మకూరు: పట్టణంలోని ఏపీఎస్ ఆర్టీసీ డిపోలో శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ మహేంద్రుడు గురువారం తెలిపారు. ఆత్మకూరు డిపో పరిధిలో ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలు నేరుగా సెల్‌ఫోన్ ద్వారా మధ్యాహ్నం 12 నుంచి 1 గంట వరకు సెల్ నెంబర్ 9959225801కు ఫోన్ చేసి తెలపవచ్చని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కిరాణ దుకాణంలో చోరీ

నందికొట్కూరు: కిరాణ దుకాణంలో చోరీ జరిగిన ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్ఐ ఎన్వీ రమణ తెలిపిన వివరాల మేరకు పాత బస్టాండ్ వద్ద ఓ కిరాణ దుకాణంలో బుధవారం అర్ధరాత్రి షాపు రెండు షెటర్లు పగలగొట్టి రూ. 63 వేలు నగదు, రూ. 8 వేలు విలువ చేసే గోల్డ్ సిగరెట్ల బండిళ్లను ఎత్తుకెళ్లారన్నారు. యాజమాని బాషా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

11న 'నా దేశం–నా భూమి'

నందికొట్కూరు: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా 'నా దేశం–నా భూమి' కార్యక్రమాన్ని ఈనెల 11న నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కిషోర్ గురువారం తెలిపారు. ఈ నెల 11న ఉదయం 10 గంటలకు వసుధకు వందనం (మొక్కలు నాటు కార్యక్రమం) జై కిసాన్ పార్కులో ప్రారంభించడం జరుగుతుందన్నారు. వీరులకు వందనం అనే కార్యక్రమం ద్వారా మాజీ సైనికులకు సన్మాన కార్యక్రమాలు ఉంటాయన్నారు. సంతగేట్ స్కూల్‌లో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తామని చెప్పారు.

క్లుప్తంగా

దత్తాత్రేయస్వామికి విశేష పూజలు



దత్తాత్రేయస్వామికి పూజలు నిర్వహిస్తున్న ఈఓ, అర్చకులు

శ్రీశైలంటెంపుల్: లోకకల్యాణం కోసం శ్రీశైల దేవస్థానం గురువారం సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన శ్రీదత్తాత్రేయస్వామికి దేవస్థానం ఈఓ, అర్చకులు విశేష పూజలను నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాధి, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.

వెలుగోడు ఎస్ఐగా వెంకట ప్రసాద్



వెలుగోడు: వెలుగోడు పోలీసుస్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా వెంకట ప్రసాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఎస్ఐ మాట్లాడుతూ.. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. అసాంఘిక కార్యక్రమాలు, జూదం, అక్రమ మద్యం తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. పోలీసు సిబ్బంది నూతన ఎస్ఐకి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ– క్రాప్ నమోదు తప్పనిసరి

మిడుతూరు: ప్రతి రైతు తప్పనిసరిగా ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి పీరునాయక్ అన్నారు. గురువారం మండల పరిధిలోని తలముడిపి గ్రామంలో పంట నమోదును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పంట నమోదు చేయించుకోవడంవల్ల రైతులకు రైతు భరోసా, ఇన్‌పుట్ సబ్సిడీ, ఉచిత పంటల బీమా, సున్నా వడ్డీ పంట రుణాలు తదితర సంక్షేమ ఫలాలు అందుతాయన్నారు. అగ్రికల్చర్ అసిస్టెంట్ నూర్‌మీసా, రైతులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

మిడుతూరు: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ శివకుమార్ గౌడు సూచించారు. గురువారం స్థానిక సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం, కస్తూర్బా బాలికల విద్యాలయంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు మన చుట్టూ పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వార్డెన్ రవికుమార్, హెల్త్ సూపర్‌వైజర్లు ఏసేపు, రామతులశమ్మ, ఏఎన్ఎం జ్యోతి పాల్గొన్నారు.

చురుగ్గా ఓటర్ల సర్వే

ఆత్మకూరు: పట్టణంలో హౌస్ టు హౌస్ సర్వే చురుగ్గా సాగుతోంది. గురువారం పలు వార్డుల్లో బీఎల్ఓ, బీఎల్ఏ ఇంటింటికి తిరుగుతూ ఓటర్ల జాబితాలో ఓటర్లుగా ఉన్నారా లేదా ఇతర ప్రాంతాలకు వెళ్లారా.., వలసకు వెళ్లారా.. తదితర విషయాలను సేకరిస్తున్నారు. నూర్జహాన్, ముంతాజ్, మగ్బుల్‌లు వివిధ వార్డుల్లో సర్వే నిర్వహిస్తున్నారు.

మెరుగైన వైద్యం అందించాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఎంహెచ్‌వో

నందికొట్కూరు రూరల్ : గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా అడిషనల్ డీఎంహెచ్ఓ శారద వైద్యాధికారులకు సూచించారు. గురువారం మండల పరిధిలోని బ్రాహ్మణకొట్కూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. అదేవిధంగా డబ్ల్యూహెచ్‌వో టీమ్ మెంబర్ డాక్టర్ రవికాంత్ గురువారం పీహెచ్‌సీని పరిశీలించారు.

డెంగీ కేసు నమోదు

మహానంది: బండిఆత్మకూరులో డెంగీ కేసు నమోదైందని నంద్యాల జిల్లా మలేరియా అధికారి కామేశ్వరరావు తెలిపారు. గురువారం సిబ్బందితో కలిసి బండిఆత్మకూరు గ్రామానికి చేరుకుని డెంగీ పాజిటివ్ వచ్చిన ఇంటిని సందర్శించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆయన వెంట ఏఎంఓ వరప్రసాద్‌రెడ్డి, ఈఓఆర్‌డీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

జీఈఆర్ సర్వే పూర్తి చేయాలి

పాములపాడు: మండలంలో జీఈఆర్ (గ్రాస్ ఎన్‌రోల్‌మెంటు) సర్వేను వెంటనే పూర్తి చేయాలని ఎంపీడీఓ గోపీకృష్ణ, ఎంఈఓ బాలాజీనాయక్ ఆదేశించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి బడి బయటి పిల్లల వివరాలు సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని వివరించారు.

సైనికుల సేవలు ఎనలేనివి



బుక్కాపురంలో మాజీసైనికులను సన్మానించిన ఎంపీపీ, జడ్పీటీసీ, ప్రజాప్రతినిధులు

మహానంది: దేశ సరిహద్దుల్లో ఉంటూ ప్రాణాలకు తెగించి సేవలు చేస్తున్న దేశ సైనికుల సేవలు ఎనలేనివని మహానంది మండల అధ్యక్షురాలు బుడ్డారెడ్డి యశస్విని, వ్యవసాయ కళాశాల ప్రిన్సిపాల్ కేపీఎస్ నాయక్ అన్నారు. బుక్కాపురం, గోపవరం, అల్లినగరం గ్రామాల్లో గురువారం నా భూమి, నా దేశం కార్యక్రమం నిర్వహించారు. బుక్కాపురంలో మాజీ సైనికులను ఘనంగా సన్మానించి వారి సేవలను కొనియాడారు. కార్యక్రమాల్లో జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి, మండల ఉపాధ్యక్షురాలు కుంచపు లక్ష్మీనరసమ్మ, సర్పంచులు కందుల వరలక్ష్మమ్మ, చలంచలం శిరీష, లక్ష్మీదేవి, సుదర్శనం, తహసీల్దార్ జనార్దన్‌శెట్టి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివనాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుడు ముస్తాక్ అహ్మద్ తల్లిదండ్రులకు సన్మానం

దేశ రక్షణ కోసం ప్రాణాలర్పించిన పార్నపల్లెకు చెందిన ముస్తాక్ అహమ్మద్ దేశానికే గర్వకారణమని బండిఆత్మకూరు ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి తెలిపారు. బండిఆత్మకూరు మండలం పార్నపల్లె, ఏకోడూరు, ఎర్రగుంట్ల, బండిఆత్మకూరు గ్రామాల్లో గురువారం నా దేశం– నా భూమి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దేశం కోసం ప్రాణాలర్పించిన ముస్తాక్ అహమ్మద్ తల్లిదండ్రులు ముల్లా ఇబ్రహీమ్, ముల్లా నజీమున్నీసాలను సన్మానించారు. కార్యక్రమాల్లో సర్పంచ్ షబ్బీర్ అహమ్మద్, ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శశికళారెడ్డి, ఏపీఓ వసుధ పాల్గొన్నారు. గ్రామాల్లో మాజీ సైనికులను సన్మానించి వారి సేవలను కొనియాడారు.

గ్రామ గ్రామాన నాభూమి –నాదేశం

నందికొట్కూరు రూరల్ : ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా గురువారం మండల పరిధిలోని బొల్లవరం, దామగట్ల గ్రామాల్లో నాభూమి–నాదేశం కార్యక్రమాన్ని అధికారులు ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో శోభారాణి, ఏపీవో అలివేలుమంగమ్మలు ఆయా గ్రామాల్లో శిలా ఫలకాలను ఏర్పాటు చేసి, మొక్కలను నాటి పంచప్రాణ్ ప్రతిజ్ఞ కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచులు లక్ష్మిదేవి, సుశీలమ్మ, ఈసీ షబానా తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: మండల పరిధిలోని దుద్యాలలో ఏపీఓ రేష్మ, ఎదురుపాడులో సర్పంచు షేక్ నాజియాల ఆధ్వర్యంలో నామట్టి..నాదేశం కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ మేరి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు.

శ్రీశైలంప్రాజెక్ట్: ఆజాదీకా అమృతమహోత్సవంలో భాగంగా గురువారం ప్రభుత్వ డిగ్రీకళాశాలలో మేరీ మిట్టీ– మేరీ దేశ్ కార్యక్రమం నిర్వహించారు. అమర వీరుల జ్ఞాపకార్థం కళాశాల నుంచి రింగ్‌పార్క్ వరకు విద్యార్థులచే ర్యాలీ నిర్వహించి దేశభక్తిని చాటుకున్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా.ఎమ్ బుచ్చయ్య., అధ్యాపకులు నిర్మళ, ఎస్‌మహేశ్వరరెడ్డి, ఎమ్‌పద్మ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముందు కళాశాల పూర్వ ప్రిన్సిపల్ డాక్టర్ పి మాల్యాద్రి మృతికి సంతాపాన్ని వ్యక్తం చేశారు.



పార్నపల్లెలో ముస్తాక్ అహమ్మద్ తల్లిదండ్రులను సన్మానిస్తున్న దృశ్యం

పగిద్యాల: ఆజాదీకా అమృత్ మహోత్సవాల్లో భాగంగా రెండవ రోజైన గురువారం సంకిరేణిపల్లె పంచాయతీలో నా భూమి.. నాదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గ్రామంలో మొక్కలు నాటారు. ఎంపీడీఓ వెంకటరమణ, ఈఓఆర్డీ నాగేంద్రయ్య, ఏపీఓ మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: పుట్టిన గడ్డపై ప్రతి వ్యక్తి దేశభక్తిని కలిగి ఉండాలని ఎంపీపీ సువర్ణమ్మ, ఎంపీడీఓ సుబ్రమణ్యశర్మ, వైఎస్ ఎంపీపీ రవణమ్మ, సర్పంచులు నాగార్జునరెడ్డి, ప్రకాశం, ఏపీఓ గౌరీబాయి తెలిపారు. గురువారం మండలంలోని పి.లింగాపురం, తంగడంచ, పారుమంచాల గ్రామాల్లో ఆజాదీకా అమృత్ మహోమత్సవ్ కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఈసీ నజీర్, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

శ్రావణమాస ఏర్పాట్లపై పరిశీలన



పాతాళగంగ మెట్ల మార్గాన్ని పరిశీలిస్తున్న ఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో 17 నుంచి సెప్టెంబర్ 15వ తేదీ వరకు జరుగు శ్రావణమాసోత్సవాలు దృష్టిలో ఉంచుకుని విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా దేవస్థానం ఈఓ ఎస్ లవన్న సంబంధిత అధికారులతో కలిసి పాతాళగంగ , కల్యాణకట్ట, డార్మెటరీ, పాతాళేశ్వర సదన్, మల్లికార్జున సదన్, గంగాగౌరీసదన్‌లను పరిశీలించారు. ముందుగా పాతాళగంగ మెట్ల మార్గంలో నడిచివెళ్లి ఆయా ఏర్పాట్లు పై పలు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం పాతాళేశ్వరసదన్ అతిథిగృహాన్ని పరిశీలించి, ఆధునీకరించడానికి వెంటనే చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఈఈ వి.రామకృష్ణ, సహాయ కార్యనిర్వాహణాధికారులు ఎం.హరిదాసు, శ్రీనివాసరెడ్డి, పర్యవేక్షకులు మల్లికార్జునరెడ్డి, శివప్రసాద్ తదితరులు ఉన్నారు.

సిబ్బంది వసతి గృహ నిర్మాణాల పరిశీలన

శ్రీశైలం ప్రాజెక్ట్ కాలనీలో శ్రీశైల దేవస్థానం నిర్మిస్తున్న సిబ్బంది వసతిగృహాల నిర్మాణ పనులను గురువారం దేవస్థానం ఈఓ ఎస్ లవన్న ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. వారు మాట్లాడుతూ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాని ఆదేశించారు. అదే విధంగా నిర్మాణంలో పూర్తిగా నాణ్యత ప్రమాణాలను పాటించాలని, ఏ చిన్నపనిలో కూడా నాణ్యతాపరంగా రాజీ పడకూడదని అధికారులకు సూచించారు.

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించాలి

ఆత్మకూరు: రైతన్నలు తక్కువ పెట్టుబడి పెట్టి అధిక దిగుబడులు సాధించాలని ఏడీఏ ఆంజనేయులు సూచించారు. ఆత్మకూరు పట్టణ శివారులో గురువారం వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కందిలో సమగ్ర సస్య రక్షణ చర్యలు ఎలా తీసుకోవాలని, పంటలు ఎలా సాగు చేయాలి, మెలకువలు, సలహాలు, సూచనలు ఇచ్చారు. రైతులు జీవామృతం, వేపకషాయం గురించి ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బైరాపురం మహబూబ్‌బాషా, అష్రఫ్ అలీ, గౌడ్, సావిత్రిబాయి తదితరులు పాల్గొన్నారు.

మోతుకూరులో పొలంబడి

వెలుగోడు: మండలంలోని మోతుకూరు గ్రామంలో శుక్రవారం డాక్టర్ వైఎస్సార్ పొలంబడి నిర్వహించారు. కార్యక్రమానికి ఆత్మకూరు వ్యవసాయ సహాయ సంచాలకులు ఆంజనేయ, మండల వ్యవసాయ అధికారి పవన్‌కుమార్ హాజరయ్యారు. అనంతరం వెలుగోడు పట్టణంలోని ఆర్‌బీకే సిబ్బందితో ఏడీఏ ఆంజనేయులు సమీక్ష నిర్వహించారు.

జగనన్న పాలనను దీవించండి



గెలాక్షి ఫ్రెష్ చికెన్ గ్రాండ్‌ను ప్రారంభిస్తున్న రాష్ట్ర శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

నందికొట్కూరు: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనను దీవించాలని రాష్ట్ర శాప్ చైర్మన్, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి కోరారు. గురువారం పట్టణంలోని చౌడేశ్వరిదేవి ఆలయ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన గెలాక్షి ఫ్రెష్ చికెన్ గ్రాండ్‌ను ప్రారంభించారు. ప్రత్యేకంగా నిర్వహించిన పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా పేదలకు సంక్షేమ పథకాలు అందించిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డేనన్నారు. కార్యక్రమంలో శివప్రసాదరెడ్డి, వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు చాంద్‌బాషా, కృష్ణ, రవూఫ్, నాయబ్, నాయకులు పుల్యాల నాగిరెడ్డి, ఉస్మాన్‌బేగ్, రవీంద్రారెడ్డి, శాలు పాల్గొన్నారు.

నల్లమల ఘాట్‌లో మినీ లారీ బోల్తా

మహానంది: నంద్యాల–గిద్దలూరు నల్లమల ఘాట్ రోడ్డులోని దాదాఖలేందర్ స్వామి దర్గా వద్ద బియ్యం బస్తాలతో వెళ్తున్న మినీ లారీ బోల్తాపడింది. గురువారం జరిగిన ఈ సంఘటనలో ఎవరికి ఎలాంటి ప్రమాదం లేకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. నంద్యాల వైపు నుంచి వెళ్తున్న ట్రక్కుకు ఎదురుగా ట్రాలీ ఆటో రావడంతో మలుపు వద్ద తప్పించబోయి అదుపు తప్పి బోల్తా పడిందని స్థానికులు తెలిపారు.

బీరప్పస్వామి సదన్ ఆధునికీకరణకు సహకరించండి

శ్రీశైలం: క్షేత్రపరిధిలో కురుమ సంఘీయుల బీరప్పస్వామి సదన్‌ను ఆధునికీకరించడానికి దాతలు ముందుకు రావాలని సత్రం చైర్మన్ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. గురువారం సదన్ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో వైస్ చైర్మన్లు వినోద్‌కుమార్, బుచ్చప్ప, కార్యదర్శి కొరిడె శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఘాట్ నిర్వాహకులపై బైండోవర్ కేసు

పగిద్యాల: కృష్ణానది బ్యాక్‌వాటర్‌లో ప్రభుత్వ అనుమతి లేకుండా ఇంజిన్ బోట్ నడుపుతున్న మూర్వకొండ ఘాట్ నిర్వాహకులపై బైండోవర్ కేసు నమోదు చేసినట్లు ముచ్చుమర్రి ఎస్ఐ నాగార్జున తెలిపారు. గురువారం నందికొట్కూరు అర్బన్ సీఐ విజయ్‌భాస్కర్ సమక్షంలో ఘాట్ నిర్వాహకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. శ్రీశైలం రిజర్వాయర్‌కు వరద జలాలు వచ్చి చేరుతున్నందున నదిలో ఎలాంటి ఇంజిన్ బోట్లు నడిపేందుకు ప్రభుత్వ అనుమతులు లేవని హెచ్చరించారు. అనంతరం పగిద్యాల తహసీల్దార్ భారతి ఎదుట ఘాట్ నిర్వాహకులను హాజరు పరిచారు. సొంత పూచికత్తుపై నిందితులను తహసీల్దార్ విడుదల చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నులిపురుగులను నివారిద్దాం



జూపాడుబంగ్లా కస్తూర్బా పాఠశాలలో బాలికలకు ఆల్బెండజోల్ మాత్ర వేస్తున్న డాక్టర్ సభా

కొత్తపల్లి: పరిశుభ్రతను పాటించడం ద్వారా నులిపురుగును నివారిద్దామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరమ్మ, ఎర్రమఠం పీహెచ్‌సీ వైద్యురాలు సౌజన్య పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని ముసలిమడుగు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సర్పంచు జమీలాబీ ఆధ్వర్యంలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని జరుపుకున్నారు. చిన్నారులకు ఆల్‌బెండజోల్ మాత్రలను వేశారు. మండల కేంద్రంలో పీహెచ్‌సీ డాక్టర్ వినోద్ కుమార్, డాక్టర్ దీపానాగవేణిలు జెడ్పీహెచ్ పాఠశాలలో, శ్రీ రాజరాజేశ్వరి హైస్కూల్‌లో విద్యార్థులకు ఆల్‌బెండజోల్ మాత్రలను వేశారు.

అల్బెండజోల్ మాత్రల పంపిణీ

జూపాడుబంగ్లా: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం జూపాడుబంగ్లా, పారుమంచాల ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల పరిధిలో ఉన్న అంగన్‌వాడీ, పాఠశాలల్లోని బాల, బాలికలకు పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ నాగేంద్ర, డాక్టర్ సభా, డాక్టర్ మౌనిక, డాక్టర్ యశశ్విని అల్బెండజోల్ మాత్రలను మింగించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ వహబ్, సూపర్‌వైజర్లు రాముడు, విజయలక్ష్మమ్మ పాల్గొన్నారు.

వెలుగోడు: వేల్పనూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు వైద్యాధికారి వంశీకృష్ణ ఆధ్వర్యంలో ఆల్‌బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. వేల్పనూరు పీహెచ్‌సీ పరిధి 95శాతం పిల్లలకు మాత్రలను పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ శ్రీనివాసులు, వేల్పనూరు సచివాలయం గ్రేడ్ 3 ఏఎన్ఎం సుజాత పాల్గొన్నారు.

98.8శాతం మంది పిల్లలకు మాత్రలు

పాములపాడు: నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలో గురువారం 98.8శాతం మంది పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు మింగించామని డాక్టర్లు నాగలక్ష్మి, గులాబ్‌షా తెలిపారు. కార్యక్రమాల్లో ఎంఈఓ బాలాజీనాయక్, పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిన్నారులకు అల్బెండజోల్ మాత్రలు

ఆత్మకూరు: చిన్నారులకు తప్పనిసరిగా అల్బెండజోల్ మాత్రలు వేయించాలని బైర్లూటి వైద్యాధికారి గోపాల్, పవన్‌కుమార్ అన్నారు. మండలంలోని బైర్లూటి పీహెచ్‌సీ పరిధిలో అంగన్ వాడీ, పాఠశాలల్లోని విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు వేశారు.

పరిశుభ్రతపై అవగాహన

శ్రీశైలంప్రాజెక్ట్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని జువాలజీశాస్త్ర అధ్యాపకులు అబుబాకర్ అన్నారు. నేషనల్ డివార్మింగ్ డే సందర్భంగా గురువారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు అల్బెండోజల్ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సూర్యనారాయణ, అధ్యాపకులు ప్రసాద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎన్. శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉప ఎన్నికలకు ముగిసిన నామినేషన్ల పర్వం

- చివరి రోజు భారీగా నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థులు
- రేపు నామినేషన్ పత్రాల స్క్రూటీ్నీ
- 14వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఉపసంహరణకు అవకాశం
- 19న ఉదయం ఎన్నికలు, మధ్యాహ్నం కౌంటింగ్



పగిద్యాల 9వ వార్డుకు నామినేషన్ వేస్తున్న గుండెపోగు సాంబ

జూపాడుబంగ్లా: ఆత్మకూరు డివిజన్ పరిధిలోని గ్రామపంచాయతీల్లో ఖాళీగా ఉన్న వార్డు మెంబర్ స్థానాల ఉప ఎన్నికలకు నామినేషన్‌ల పర్వం గురువారంతో ముగిసింది. మండలంలోని జూపాడుబంగ్లాలోని 7వ వార్డు, తర్తూరులోని 2వ వార్డు స్థానాలకు ఉప ఎన్నికలు జరుగుతుండగా.. గురువారం జూపాడుబంగ్లా వార్డుకు మూడు, తర్తూరు వార్డుకు రెండు నామినేషన్లు దాఖలైనట్లు ఆర్ఓలు శ్రీనివాసులు, నాగేంద్ర తెలిపారు. మొత్తంగా జూపాడుబంగ్లా వార్డుకు మూడు నామినేషన్లు దాఖలు కాగా, తర్తూరు వార్డుకు నాలుగు నామినేషన్లు వేశారు. అభ్యర్థులు వేసిన నామినేషన్లను శుక్రవారం స్క్రూటీ్నీ నిర్వహిస్తామని ఆర్ఓలు తెలిపారు. 12న సాయంత్రం 5లోగా నామినేషన్లపై అభ్యంతరాల స్వీకరణ, 13న అభ్యంతరాలపై విచారణ, 14న సాయంత్రం 5లోగా నామినేషన్ల విత్‌డ్రా, 19వ తేదీ ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1.00గంట పోలింగ్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మధ్యాహ్నం 2గంటల నుంచి పోలైన ఓట్లను లెక్కించి గెలుపొందిన అభ్యర్థులను ప్రకటించి, డిక్లరేషన్ ఫారం అందజేయనున్నట్లు తెలిపారు.

9వ వార్డుకు నాలుగు నామినేషన్లు

పగిద్యాల: మండల కేంద్రమైన పగిద్యాల గ్రామ పంచాయతీలో ఏర్పడిన 9వ వార్డు సభ్యుని ఎన్నికకు చివరి రోజైన గురువారం నాలుగు నామినేషన్‌లు నమోదైనట్లు ఎన్నికల రిటర్నింగ్ (స్టేజ్–2) అధికారి సుభాన్ తెలిపారు. చివరిరోజు గుండెపోగు సాంబ, కాటేపోగు విద్యాసాగర్, మీనుగ బాబు, గుండెపోగు చిన్న ఈశ్వరయ్య నామినేషన్ వేశారు. చివరి రోజునే ఈ నాలుగు నామినేషన్‌లు నమోదు కావడంతో అధికారులు ఒత్తిడికి గురయ్యారు. అయితే నామినేషన్‌ల ఉపసంహరణకు ఈనెల 14వ తేది వరకు అవకాశం ఉన్నందున బరిలో ఎవరెవరు నిలుస్తారో వేచి చూడాల్సి ఉంది.

నాగటూరులో ఐదు నామినేషన్ల దాఖలు

నందికొట్కూరు రూరల్ : నందికొట్కూరు మండలంలోని నాగటూరు గ్రామంలో 8వ వార్డు సభ్యుడి ఎన్నికకు ఐదు నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారులు షేక్షావలి, రవీంద్ర తెలిపారు. ఎస్సీలకు రిజర్వు చేయబడిన ఈ వార్డుకు గురువారం చెరుకు రత్నమ్మ అనే మహిళతో పాటు మరో నలుగురు నామినేషన్లు దాఖలు చేసినట్లు వెల్లడించారు.

కొత్తపల్లి 10వ వార్డుకు నాలుగు నామినేషన్లు

కొత్తపల్లి: మండల కేంద్రంలోని 10వ వార్డుకు నాలుగు నామినేషన్లు వచ్చినట్లు ఎన్నికల రిటర్నింగ్ స్టేజ్–1 అధికారి కె.మహేష్ గురువారం తెలిపారు. బుధవారం మొల్ల తెహరాబీ నామినేషన్ వేయగా, గురువారం మరో ముగ్గురు నామినేషన్ వేసినట్లు వివరించారు. చివరిరోజు తప్పెట నాగమ్మ, నూనె ఈశ్వరమ్మ, గోద శివమ్మ నామినేషన్లు వేసినట్లు తెలిపారు.

రెండు వార్డులకు పది నామినేషన్లు

ఆత్మకూరు: ఆత్మకూరు మండలంలోని ముష్టపల్లి, కరివేన గ్రామాల్లో ఖాళీగా ఉన్న రెండు వార్డుమెంబర్ల స్థానాలకు ఎన్నికల నామినేషన్ల చివరి రోజు గురువారం పది నామినేషన్లు దాఖలయ్యాయి. కరివేన గ్రామంలో ఒక్క వార్డు మెంబర్‌కు గాను ఎనిమిది మంది అభ్యర్థులు నామినేషన్లను వేశారు. ముష్టపల్లి గ్రామంలో జరుగుతున్న ఒక వార్డుకు ఇద్దరు నామినేషన్లు వేశారు. ఇందులో వైఎస్సార్‌సీపీ మద్దతుతో జగపతి లక్ష్మీదేవి నామినేషన్ వేయగా, టీడీపీ మద్దతుతో రాజేశ్వరరమ్మ నామినేషన్లు దాఖలు చేశారు.

మిడుతూరులో ఏడు నామినేషన్లు

మిడుతూరు: మండలంలోని వార్డు ఉప ఎన్నికకు ఏడు నామినేషన్లు వచ్చినట్లు గురువారం ఎంపీడీఓ జీఎన్ఎస్ రెడ్డి తెలిపారు. గురువారం పైపాలెం గ్రామంలోని 5వ వార్డుకు పిక్కిలి లక్ష్మీదేవి, బాలసుబ్బన్న నామినేషన్లు వేయగా, మిడుతూరులోని 13వ వార్డుకు బోయ భాగ్యమ్మ, అలగనూరు గ్రామంలోని 10వ వార్డుకు శేషమ్మ, వీపనగండ్ల గ్రామంలోని 3వ వార్డుకు కురువ చిన్న స్వామన్న, జలకనూరు గ్రామంలోని 8వ వార్డుకు సిరిగిరి రవణమ్మ, సిరిగిరి కుమారిలు నామినేషన్లు వేసినట్లు ఎంపీడీఓ తెలిపారు. 9వ తేదీ మూడు నామినేషన్లు, 10వ తేదీ 7 నామినేషన్లు , రెండు రోజుల్లో మండలంలోని వార్డు ఉప ఎన్నికలకు 10 నామినేషన్లు వేసినట్లు ఎంపీడీఓ వెల్లడించారు.

4వ వార్డు సభ్యుని ఎన్నిక ఏకగ్రీవం!



4వ వార్డుకు నామినేషన్ పత్రాన్ని ఆర్ఓకు అందజేస్తున్న అభ్యర్థి వంగాల రమాదేవి

పాములపాడు: పాములపాడు మండల కేంద్రంలోని 4వ వార్డు ఉప ఎన్నికకు కేవలం ఒక నామినేషన్ మాత్రమే దాఖలైనట్లు ఆర్ఓ జుబేర్ గురువారం తెలిపారు. నామినేషన్ల దాఖలుకు గడువు ముగియడం, ఒక్క నామినేషన్ మాత్రమే రావడంతో అభ్యర్థి ఎన్నిక ఏకగ్రీవమైనట్టే. 4వ వార్డు సభ్యురాలు వెంకటలక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో ఎన్నిక అనివార్యమైంది. కాగా మృతి చెందిన వెంకటలక్ష్మి కుమార్తె వంగాల రమాదేవికి వార్డు సభ్యురాలుగా గ్రామ పెద్దలు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు నిర్ణయించుకొని కేవలం ఒక్క నామినేషన్ మాత్రమే దాఖలు చేయించారు. దీంతో ఆమె ఎన్నిక ఇక లాంఛనమే.